క్లుప్తంగా

నాణ్యతలో తేడా రానివ్వకండి

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్



తెనాలిఅర్బన్: నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చూడాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్ సూచించారు. 26వ వార్డు పాండు రంగపేటలోని పశువుల ఆసుపత్రి వద్ద నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.16 లక్షలతో కల్వర్టు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట డీఈ శ్రీనివాసులు, ఏఈ సూరిబాబు, తదితరులు ఉన్నారు.

గణేషుడి సేవలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్



తెనాలి: పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. స్థానిక 12వ వార్డులో కపూర్ ఫ్రెండ్స్ అధ్వర్యంలో 17వ గణపతి ఉత్సవాల్లో తొమ్మిదో రోజైన గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆ వార్డు కౌన్సిలరు కొర్రయశోద నేతృత్వంలో జరిగిన గణపతి పూజల్లో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. స్వామిని దర్శించుకుని, హారతి తీసుకున్నారు. గణేషుడి ఆశీర్వాదం తెనాలి నియోజకవర్గంలోని ప్రజలందరిపైనా ఉండాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని శివకుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, దేవరపల్లి కిషోర్, కె.లక్ష్మణ్ నాయక్, కె.ప్రశాంత్ నాయక్, కె.స్వామి నాయక్, గురుస్వామి, కృష్ణ, రమేష్ నాయక్, తపావత్ స్వామినాయక్, ముని రమేష్, సాయి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తెనాలిటౌన్: స్థానిక నాజర్‌పేట సంకావారి కొట్ల బజార్, చుట్టు ప్రక్కల ప్రాంతంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సి.హెచ్.దుర్గారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అర్బన్ బ్యాంక్ చైర్మన్ పదవికి కూటమి అభ్యర్థిని నేనే



గుమ్మడి రమేష్

తెనాలి: సుదీర్ఘ చరిత్ర కలిగిన తెనాలి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పదవికి పోటీ అనివార్యం కానుంది. బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న టీడీపీ నాయకుడు మంగమూరి హరి ప్రసాద్ మరోసారి ఏకగ్రీవం కోసం సన్నాహాల్లో ఉండగా, టీడీపీకి చెందిన మాజీ కౌన్సిలర్ గుమ్మడి రమేష్, పాలకవర్గానికి సొంత ప్యానల్‌నే పోటీకి దింపుతున్నట్లు గురువారం మరోసారి విలేకరుల సమావేశంలో ప్రకటించారు. కూటమి పార్టీల తరఫున ఎటువంటి అభ్యర్థిని ఎంపిక చేయలేదని చెబుతూ, టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి చైర్మన్ అభ్యర్థిని తానేనని ప్రకటించారు. అర్బన్ బ్యాంక్ ఎన్నికలు ఈనెల 14వ తేదీన జరగనున్న విషయం తెలిసిందే. ఈనెల ఏడో తేదీన నామినేషన్ల ప్రక్రియ జరగనుంది.

6న ఏఏఎఫ్ రాష్ట్రస్థాయి సమావేశం

తెనాలిరూరల్: అంబేడ్కర్ ఆలోచనా ఫౌండేషన్(ఏఏఎఫ్) 19వ రాష్ట్రస్థాయి సమావేశాన్ని ఈ నెల 6వ తేదీన గుంటూరులో నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీధర్ గురువారం తెలిపారు. గుంటూరు గీతా రీజెన్సీలో జరిగే ఈ సమావేశంలో ఏఏఎఫ్ చైర్మన్ పినిపే రామకృష్ణ, ఏపీ స్టేట్‌బార్ కౌన్సిల్ మెంబర్ బైపా అరుణ్‌కుమార్ పాల్గొంటారని, న్యాయవాదులు పాల్గొని న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి చర్చించి తగు చర్యలు తీసుకునేలా సహకరించాలని కోరారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

తెనాలి: 2025 సంవత్సరానికి ప్రభుత్వం ప్రకటించిన గుంటూరు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తెనాలి నియోజకవర్గానికి చెందిన ఆరుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వీరిలో తెనాలి పట్టణం, రూరల్ మండలానికి చెందిన అయిదుగురు ఉన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వీరికి అవార్డులు బహూకరిస్తారు.

మాచర్ల నాగేశ్వరరావు...



రూరల్ మండలం కొలకలూరులోని జిల్లాపరిషత్ హైస్కూల్ గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న మాచర్ల నాగేశ్వరరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. వీరి సొంతూరు ప్రస్తుతం బాపట్ల నియోజకవర్గంలోని భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామం. ఐలవరం, భట్టిప్రోలు చదివాక నగరంలోని ఎస్‌వీఆర్‌ఎం కాలేజిలో ఇంటర్, డిగ్రీ చేశారు. ఏఎల్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, గుంటూరులో బీఎడ్ చేశారు. 1987లో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ టీచరుగా పల్నాడు జిల్లా బండ్లమోటులోని జిల్లాపరిషత్ హైస్కూలులో విధుల్లో చేరారు. తర్వాత కొల్లూరు, దోనేపూడిలో పనిచేసి 2003లో ప్రధానోపాధ్యాయుడుగా పదోన్నతి పొందారు. నెల్లూరు జిల్లా వింజమూరు మండలం గుండెమెడకల, వేమూరులోని సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్యాపర్రులోని జిల్లా పరిషత్ హైస్కూలులో పనిచేశారు. 2023 నుంచి కొలకలూరులో పనిచేస్తున్నారు.

ఆకురాతి హరివరప్రసాద్...



రూరల్ మండలం కొలకలూరులోని ఎంపీపీఎస్‌జీ ఎంపీ స్కూలులో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆకురాతి హరివరప్రసాద్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. వీరి సొంతూరు తెనాలి. 2000 సంవత్సరం డీఎస్సీలో ఎంపికై, తొలిసారిగా దొడ్లేరులో ఉపాధ్యాయ జీవితాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి అమృతలూరు, నగరం, తెనాలి మండలాల్లోని పలు పాఠశాలల్లో పనిచేశారు. డీఆర్‌పీ టీచర్లకు శిక్షణనూ ఇచ్చిన హరివరప్రసాద్‌కు యోగలోనూ మంచి ప్రవేశం ఉంది.

బి.జగన్నాథ నాయక్...



మరో ఉత్తమ ఉపాధ్యాయుడు బి.జగన్నాథ నాయక్ సొంతూరు మంగళగిరి మండల గ్రామం పెదవడ్లపూడి. 2000 సంవత్సరం డీఎస్సీలో నెగ్గి, తెనాలి మున్సిపాలిటీలో ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. గత 24 సంవత్సరాలుగా ఇక్కడే పలు పాఠశాలల్లో చేశారు. 2024లో ప్రధానోపాధ్యాయుడుగా పదోన్నతి లభించింది. గత జూన్ నుంచి మోడల్ స్కూల్ హెచ్‌ఎంగా స్థానిక రజకపేటలోని ఆలపాటి వెంకట్రామయ్య ప్రత్యేక పాఠశాలలో పనిచేస్తున్నారు.

పూషడపు స్వాతి...



తెనాలి మున్సిపాలిటీలో ఎంఈఎస్, చెంచుపేట పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేస్తున్న పూషడపు స్వాతి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డుకు ఎంపికయ్యారు. సొంతూరు బాపట్ల జిల్లా నగరం. తల్లిదండ్రులు రాజశేఖర్, గాయత్రి. బీఎస్సీ, బీఈడీ చేసిన స్వాతి, 2010లో రేపల్లె మున్సిపాలిటీలో నేతాజీ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో తొలిగా ఉపాధ్యాయురాలిగా చేరారు. ప్రస్తుతం తెనాలి మున్సిపాలిటీ ఉపాధ్యాయినిగా ఉన్నారు. విద్యతోపాటు విద్యార్థులకు టార్ల్ ఆర్‌పీ, విభా యాక్టివిస్ట్, కో-కర్రికులర్, టీఏల్‌ఎం, స్మార్ట్ టీవీ, ఫ్లాష్ కార్డ్స్, తల్లిదండ్రులతో చక్కని సంబంధాలను బోధిస్తున్నారు. తన భర్త పోలిశెట్టి సత్యనారాయణ కూడా ఉపాధ్యాయ వృత్తిలోనే ఉన్నారు.

అన్నపురెడ్డి నాగమణి...



స్థానిక అయితానగర్‌లోని ఎస్‌ఎస్‌ఎస్ మున్సిపల్ హైస్కూలులో స్కూల్ అసిస్టెంట్‌గా చేస్తున్న అన్నపురెడ్డి నాగమణి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డుకు ఎంపికయ్యారు. విశ్రాంత ఎంసీఆర్‌డీఓ అంకయ్య కుమార్తె. ఎంఎస్సీ, ఎంఏ, బీఈడీ చేశారు. తొలుత 2002లో ఎస్‌జీటీ ఉపాధ్యాయినిగా ఎంపికై, 2012 డీఎస్సీతో స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ)గా నియమితులయ్యారు. పట్టణ మున్సిపాలిటీల్లో పనిచేశారు. గత పన్నెండేళ్లుగా ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతన పరీక్షకు విద్యార్థులను సంసిద్ధులను చేస్తున్నారు. వీరి శిక్షణలో 40 మంది ఉపకార వేతనాలను అందుకున్నారు. సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్, ట్రైనింగ్‌ను ఇస్తున్నారు. పాఠశాల సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలోనూ గుర్తింపును తెచ్చుకున్నారు.

కొల్లిపర నుంచి ఇద్దరు



ఉమాదేవి



అలివేలుకుమారి

కొల్లిపర: మండల పరిధిలోని ఇద్దరు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఈవో2 ఝాన్సీలత తెలిపారు. నేడు ఉపాధ్యాయులు దినోత్సవం సందర్భంగా గురువారం రాత్రి ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారి వివరాలు ప్రకటించింది.

దీంతో మండలంలోని వల్లభాపురంలోని మోడల్ ప్రైమరీ పాఠశాల (ఎల్‌ఈ)లో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న దివి ఉమాదేవి కొల్లిపర గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలోని(ఎల్‌ఈ) ప్రధానోపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న దాసరి అలివేలుకుమారిలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు తెలిపారు. దీంతో ఆమె ఇద్దరికీ అభినందనలు తెలియజేశారు.

జ్వరమొస్తే వైద్యులను సంప్రదించండి

మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు



వైద్య శిబిరానికి వచ్చిన రోగులు

తెనాలిఅర్బన్: జ్వరం వచ్చిన వెంటనే వైద్యశాలలో చూపించుకోవాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు సూచించారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు కాలనీలో గురువారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యేసుబాబు మాట్లాడుతూ షుగర్, బీపీ, మలేరియా, టైఫాయిడ్ వంటి పరీక్షలను అర్బన్ హెల్త్ సెంటర్‌లలో చేస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ దోమకాటు వలన జ్వరం, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సరోజిని, ఏఎంఎస్‌లు, ఆశ కార్యకర్తలు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు ఢీకొని బాలికకు తీవ్ర గాయాలు

తెనాలిరూరల్: స్కూల్ బస్సు ఢీకొని బాలిక తీవ్ర గాయాలపాలైన ఘటన తెనాలి మండలం చావావారిపాలెం వద్ద చోటు చేసుకుంది. పొన్నూరుకు చెందిన కుటుంబం పొలం పనుల కోసం వచ్చి చావావారిపాలెం వద్ద రోడ్డు వెంబడి నివసిస్తోంది. ఆరేళ్ల చిన్నారి మేఘమాల మంచినీళ్ల కోసమని రోడ్డు దాటుతుండగా అంగలకుదురుకు చెందిన ప్రైవేటు స్కూల్ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టిందని తల్లిదండ్రులు తెలిపారు. కాలికి తీవ్ర గాయం కావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్కూల్ యాజమాన్యం తమనే బెదిరిస్తున్నారని చిన్నారి తల్లిదండ్రులు వాపోయారు.

వ్యభిచార స్థావరంపై పోలీసుల దాడి

తెనాలిరూరల్: వ్యభిచార స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. తెనాలి బోస్‌రోడ్డులోని టౌన్‌చర్చి ఎదురు రోడ్డులోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతోందన్న సమాచారంతో వన్ టౌన్ సీఐ వి. మల్లికార్జునరావు, సిబ్బంది గురువారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. వ్యభిచారం నిర్వహిస్తున్న నర్రా గోపి, షేక్ ఆసియాతో పాటు ఇద్దరు విటులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయులకు సత్కారం



తెనాలిరూరల్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని సంగంజాగర్లమూడి గ్రామంలోని ఎస్‌కేవీసీఎం జెడ్పీ హైస్కూలు ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్‌స్టాఫ్‌ను గురువారం సత్కరించారు. గ్రామ సర్పంచ్ పాలడుగు జయ నాగలక్ష్మి, పాలడుగు రవీంద్రబాబు దంపతులు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాలను అభినందించి సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు వర్ధన్ పర్యవేక్షించారు.

ఆలయ పాలకవర్గం ప్రమాణస్వీకారం



తెనాలి: స్థానిక షరాఫ్‌బజారులోని శ్రీభద్రావతి సమేత శ్రీభావనారుషి స్వామి దేవస్థానం నూతన పాలకవర్గం గురువారం ప్రమాణస్వీకారం చేసింది. అధ్యక్షునిగా చిన్నం హరిగోపాల్, సభ్యులుగా జొన్నాదుల మదన్మోహన్‌రావు, ఆకురాతి శ్రీనివాసరావు, తాడిపర్తి శ్రీనివాసరావు, గుంటి ధనలక్ష్మి సభ్యులుగా ఏర్పాటైన నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారాన్ని దేవస్థానంలో చేశారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శారదాదేవి హాజరయ్యారు. సంఘ పెద్దలు, బహూత్తమ సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. నూతన పాలకవర్గానికి అందరూ అభినందనలు తెలియజేశారు.

జగనన్న కాలనీలో వసతుల కల్పనకు వినతి

బాపట్ల అర్బన్: జగనన్న కాలనీలో రహదారులు, వీధి దీపాలు వంటి సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ నాయకుడు శరత్ కోరారు. ఈ మేరకు డీఈ కృష్ణారెడ్డికి గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ... జగనన్న కాలనీలో రోడ్లు సరిగా లేకపోవటంతో చిన్నపాటి వర్షం కురిస్తే జలమయం అవుతున్నాయని పేర్కొన్నారు. కనీసం వీధిలైట్లు కూడా లేకపోవటం రాత్రి పూట విషపూరిత పాములు కాలనీలోకి వస్తున్నాయన్నారు. దోమల బెడద ఎక్కువగా ఉండటం వలన వ్యాధులు కూడా ప్రబలుతున్నాయని చెప్పారు. కాలనీ అభివృద్ధిని పట్టించుకోవాలని కోరారు. ఆయన వెంట కాలనీవాసులు చంటి, శ్యామ్‌బాబు, మహిళలు ఉన్నారు.

రేషన్ దుకాణంపై కేసు నమోదు

పిట్టలవానిపాలెం (కర్లపాలెం): పేదలకు పంపిణీ చేసే రేషన్ దుకాణాలలో అవకతవకలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీఎస్ డీటీ ఫణికుమార్ తెలిపారు. గురువారం భవనంవారిపాలెం రేషన్ షాపు 10లో ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. 5.3 క్వింటాల బియ్యం తక్కువగా ఉండటం, పంచదార 24 ప్యాకెట్లు ఎక్కువగా ఉండటాన్ని గుర్తించి 6ఏ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్సిడీలో ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు.

ఉపాధ్యాయ లోకానికి వన్నె తెచ్చిన వ్యక్తి సర్వేపల్లి



కొల్లిపర: సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయ లోకానికి వన్నె తెచ్చారని ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఉపాధ్యాయులు మున్ముందుకు సాగాలని ఎంఈఓ 2 ఝాన్సీలత అన్నారు. గురువారం మున్నంగిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ ముందస్తు వేడుకల్ని ఆమె నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని ఎం ధనలక్ష్మి, టీచర్లు రాము, వెంకాయమ్మ, శ్రీలక్ష్మీ, నాగూర్‌బి తదితరులు ఉన్నారు. విద్యార్థులు తాము రాసిన ఉపాధ్యాయ దినోత్సవ గ్రీటింగ్ కార్డులను ప్రదర్శించారు. టీచర్లకు వాటిని అందజేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే అంశాలను నేర్చుకుని అమలు చేయడం ద్వారా వారికి నిజమైన శుభాకాంక్షలు చెప్పినట్లు అన్నారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైలు నుండి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కొలనుకొండ స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు గురువారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 30 ఉంటుందని, రైల్లో నుంచి జారిపడి మృతి చెందినట్టు భావిస్తున్నామని తెలిపారు. మృతదేహాన్ని తెనాలి వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి. వెంటాద్రిబాబు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 7207076614 నంబరులో సంప్రదించాలన్నారు.

అధిక దిగుబడులు సాధించాలి

రేపల్లె: వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ ఖరీఫ్‌లో తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ అద్దేపల్లి లక్ష్మి సూచించారు. మండలంలోని ఉప్పూడి గ్రామంలో గురువారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. అధిక మోతాదుల్లో రసాయనిక ఎరువులు వాడటం వల్ల భూమిలోని సారం దెబ్బతింటుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఏవో మహేష్ బాబు, వీఏవో గంగాభవాని, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పదవీ బాధ్యతలు చేపట్టిన వేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ బాధ్యులు

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీయోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక గంగానమ్మపేటలోని శివవేదికలో ఏర్పాటైన సభలో నూతన అధ్యక్షుడిగా డాకా సాంబిరెడ్డి, కార్యదర్శిగా సీహెచ్ విజయ భాస్కరరెడ్డి, కోశాధికారిగా కీసరి వెంకట కృష్ణారెడ్డి ప్రమాణాం చేశారు. సభ్యులుగా బొంతు చంద్రశేఖరరెడ్డి, కిక్కూరి చిన కృష్ణారెడ్డి, కిక్కూరి వెంకట సత్యనారాయణరెడ్డి, తిరుమలరెడ్డి లక్ష్మారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ప్రమాణస్వీకారం చేశారు. నూతన అధ్యక్షుడు డాకా సాంబిరెడ్డి మాట్లాడుతూ గత అధ్యక్షుడు కిక్కూరి చిన్నకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ట్రస్ట్ రెడ్డి వర్గంలోని పేదలను ఆదుకున్నట్టు చెప్పారు. రాబోయే రెండేళ్లలో రెడ్డి వర్గీయుల్లో పేదలకు విద్య, వైద్యం అవసరాల కోసం తోడ్పడతామని చెప్పారు. కార్యదర్శి సీహెచ్ విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ పూర్తిగా రెడ్ల అభివృద్ధికి పాటుపడుతుందని చెప్పారు. నియోజకవర్గంలో దాదాపు 20 వేలమంది రెడ్డి సామాజికవర్గీయులు ఉన్నట్టు చెప్పారు. సంస్థ ద్వారా రాజకీయంగా, ఆర్థికంగా తమ వర్గీయులకు సహాయ సహకారాలను అందిస్తామని చెప్పారు. పేదల సేవకు, రెడ్ల అభ్యున్నతికి దోహదపడతామని సభాధ్యక్షులు కిక్కూరి చిన్నకృష్ణారెడ్డి చెప్పారు. కోశాధికారి కీసరి వెంకట కృష్ణారెడ్డి తన ప్రసంగంలో రాబోయే రెండేళ్లలో మంచి సేవాకార్యక్రమాలతో ట్రస్ట్ పురోగమిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కిక్కూరి హైమావతి, భవనం అనూరాధ, తుమ్మా సీతారాంరెడ్డి, బాపతు శ్రీనివాసరెడ్డి, చీదేపూడి పావని, ఏలూరి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

యూరియా సమృద్ధిగా ఉంది

కొల్లిపర: రాష్ట్రంలో యూరియా పుష్కలంగా ఉందని రైతులెవరు అధైర్య పడవద్దని ఎరువులు అమ్మే దుకాణదారులు ఎరువులు కొరత సృష్టించరాదని కొరత సృష్టిస్తే అటువంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి ఎన్.శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు, గురువారం మండల పరిధిలోనే కొల్లిపర మండలంలోని చివలూరు గ్రామంలో నే రైతు సేవా కేంద్రాల నందు యూరియా మీ చెంతకే అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ వ్యాపారులు ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించిన అధిక ధరలకు అమ్మిన కఠిన చర్యలు తీసుకుంటామని, వారి లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులందరూ అధైర్య పడవద్దని కావలసినంత యూరియా ఉందని ఎవరు కృత్రిమ కొరతను సృష్టించొద్దని తెలియజేశారు. యూరియాను అధికంగా ఉపయోగించడం వలన పంటలకు నేలకు పర్యావరణానికి అనేక నష్టాలు కలుగుతాయి అని వివరించారు. నేల ఆమ్ల స్వభావం పెరగడం, నైట్రేట్ విషపూరితం, మొక్కలు ఎక్కువగా పెరిగి బలహీనపడటం, తెగులకు గురి కావడం, గాలి కాలుష్యం వంటివి కొన్ని నష్టాలు కలుగుతాయని వివరించారు. కాబట్టి రైతు సోదరులు అందరూ సిఫారసు మేరకే ఎరువులను వాడాలని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సోదరులు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి మార్కెట్ యార్డు చైర్మన్‌గా తోట దుర్గాప్రసాద్



తెనాలి: తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం నియమించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి నామినేటెడ్ పదవుల కోసం కూటమి పార్టీలకు చెందిన నాయకులు ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. గురువారం ప్రకటించిన రాష్ట్రంలోని 18 మార్కెట్ యార్డు చైర్మన్ పదవుల్లో తెనాలితో సహా రెండు యార్డుల చైర్మన్ పదవులు జనసేనకు లభించాయి. తెనాలి యార్డు చైర్మన్‌గా పట్టణానికి చెందిన జనసేన యువనేత, బీసీ యాదవ వర్గీయుడైన తోట దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. పట్టణ నాజరుపేటకు చెందిన దుర్గాప్రసాద్ రైతుకుటుంబానికి చెందిన వారు. వ్యవసాయం చేస్తూనే ఫ్లెక్సీ ప్రింటింగ్ వృత్తిలో కొనసాగుతున్నారు. జనసేన పీఏసీ చైర్మన్, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అనుచరుడు. మనోహర్ కాంగ్రెస్ పార్టీలో తెనాలి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పట్నుంచి ఆయన వెంట నడుస్తున్నారు. తన సేవలను గుర్తించి మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. రైతుల అభ్యున్నతికి తోడ్పడతానని చెప్పారు.

వైభవంగా గణేష్ నిమజ్జనం



కొల్లిపర: వినాయ చవితి పండుగను పురస్కరించుకొని మండల బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రం కొల్లిపర గ్రామంలోని బ్రాహ్మణ భవన్‌లో ఏర్పాటు చేసిన మట్టి బొజ్జ గణపయ్య 9 రోజులు వైభవంగా పూజలు అందుకుని గురువారం భక్తుల సమక్షంలో గ్రామోత్సవం నిర్వహించి కృష్ణా నదిలో నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన లడ్డు పాటలో రాజస్థాన్ నుంచి వచ్చి టీ స్టాల్ నిర్వహిస్తున్న రవి 25 వేల రూపాయిలకు పాడి లడ్డును సొంతం చేసుకున్నాడు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ ఐక్యవేదిక నాయకులు పోగుల రామలింగేశ్వర శర్మ, జగన్నాథ ఆచార్యులు, సూర్యనారాయణ శాస్త్రి, ఉదయభాస్కర్, రమణశర్మ, రాంబాబు, నిరంజన్ కుమార్, వీరభద్రరావు, శివరామ్మాస్టరు, సుధాకర్, తెనాలి బ్రాహ్మణ సంఘ నాయకులు పురుషోత్తమ శర్మ, వెంకట సుబ్రహ్మణ్య, రత్నాకర్, భక్తులు పాల్గొన్నారు.





